# పుష్ప లోకము

సాయంత్రము తెల్లమబ్బులు ఆకాశములో ఎక్కడికో ప్రయాణమయి పోవడము చూచి, 'నేనుకూడావస్తాను, తీసుకొనివెళ్ళమన్నాను.

'నీవుమాతో రావద్దు. మేము దూరదేశము వెళ్ళుతాము; సముద్రాలు దాటుతాము, అడవులు దాటిపోతాము, ఆకాశమూ భూమీ కలిసేచోటు దాటి ఇంకాపైకి వెళ్ళుతాము. నీవు రావద్దమ్మా, నీవు రావద్దు!' అన్నవి మేఘాలువాటిని నేనెంతో బతిమాలి, "మీదెక్కించు కొని నన్ను తీసుకువెళ్ళి, చిత్రాలు చూపించండి!' అని అన్నాను.

❖ ❖ ❖

పోయి పోయి, సముద్రాలు దాటి, యింకా పోతున్నాము. ఆకాశమూ భూమి కలిసేచోటికి పోతున్నాననుకొన్నాను. ఆకాశము చేతితో ముట్టుకొంటే ఏలాగుంటుందో అనుకుంటూ కూర్చున్నాను. నన్ను తీసుకుపోయి పెద్ద వనములో దింపినవి మేఘాలు.

'ఇక్కడి తమాషాలు చూస్తూ వుండు సముద్రములో నీళ్ళుతాగి మళ్ళీ వచ్చేటప్పుడు నిన్ను ఎక్కించుకుపోతాము' అన్నవి.

'సరే!' అని నేనువనములోకి వెళ్ళినాను. అక్కడ పెద్దపెద్ద మేడలు, తమాషా తమాషా యిళ్ళూ వున్నవి. అయితే అవన్నీ పచ్చిఆకులతోటే కట్టినారు. అక్కడ మగపురుగు కూడా కనబడలేదు అంతా ఆడవాళ్ళు; పిల్లలు పడుచువాళ్ళు, ముసలమ్మలూ, చూస్తే ఆడమళయాళముగా వున్నది!

ఆడవాళ్ళదేశము కావడముచేత ఆదేశము ఏలేది రాణీ, రాణీమేడ ఎంతో చక్కగావున్నది. అయితే చుట్టూ ముళ్ళు వున్నవి. పచ్చని ఆకులు, ఆకులలో ఎర్రవుయ్యాలలో వూగుతూ దొరసానిలాగ కూర్చున్నది చిన్నరాణి. వంటి మీద పూసుకొన్న గంధము ఘుమఘుమ లాడుతున్నది. ఆమెది జగన్మోహనాకారము. ఎర్రటి బుగ్గలు, వళ్ళంతా ఎరుపే. ముట్టుకొంటే కమిలిపోతుందని నాకు భయము వేసింది. కొంతమంది తెల్లరంగు బట్టలు కట్టుకొన్నారు, కొంతమంది ఎర్రరంగు

బట్టలు కట్టుకొన్నారు. అందరివీ అన్ని రకాల బట్టలు! ఆకాశములో వున్నన్ని రంగుల చీరెలు కట్టుకొన్నారు కొంతమంది.

వాళ్ళలో చిన్న పిల్లలు ఎంతో ముద్దు వస్తున్నారు, చక్కని చుక్కలు! పచ్చని గడ్డిలోనుంచి పైకి మొగాలెత్తి నన్ను చూసి, వాళ్ళు నవ్వినారు. ఆడుకుందామని దగ్గరికి వెళ్ళినాను; వెంటనే వాళ్ళు గడ్డిలో దాక్కొన్నారు. పకపకా నవ్వడము మాత్రము వినబడ్డది. దూరమునుంచి చూస్తే తలకాయ పైకెత్తి మళ్ళీ నవ్వుతారు. ఈలాగున వాళ్ళతో దాగిలిమూత లాడి, కొంతమందిని దొంగలను చేసి, పట్టుకొన్నాను.

కొంతమంది కన్నెలు నన్ను చూసి, నవ్వినారు, కొంతమంది సిగ్గుతో తల వంచుకొన్నారు. పెళ్ళికూతుళ్ళ లాగున తలకాయ వంచుకొనడము చూస్తే నాకూ నవ్వు వచ్చింది. తలకాయ వంచుకొని కడకంటితో చూస్తున్నది ఆ పువ్వు! ఆమెకు సిగ్గు కొంచెము ఎక్కువ, పిరికితనము కూడా. ఆడవాళ్ళకు ఇది సహజమే.

అయితే, బంతిపువ్వు అటువంటిది కాదు; తలకాయ ఎత్తి అటు ముఖము పెట్టి నవ్వుతుంది.

వీళ్ళందరిలోకీ సంపెంగ ఆటల మారి! ఆవిడకు దూరమూ దగ్గరా అనే భేదము లేదు. ఎంత దూరాన వున్నాసరే నేనిక్కడున్నానని కేకవేస్తుంది. దూరాన వున్నవాళ్ళను దగ్గిరికి రప్పించడములో దానంతది మరొకటి లేదు. దగ్గరకు రాగానే ఆకులలో ఆకై కనబడకుండా పోయింది. దాని కోసము వెతికి వెతికి నేను చివరకు వెళ్ళిపోతుంటే ఒక మూల నుంచి కిచకిచ మన్నది. పట్టుకోవడానికి కష్టపడి, చివరకు దొంగను చేశాను.

వీళ్ళందరికంటే పారిజాతాల సంగతి మరీ చిత్రము. నేను కిందినుంచి వెళ్ళుతూవుంటే పైన ఆడుకొంటూ వున్న పిల్లలు ఒక్కమాటు నామీదికి దూకినారు. కొంతమంది పైనుంచి పకపక నవ్వినారు; కొంతమంది జేబులో దూరినారు. కనుక్కోలేమని వాళ్ళు అనుకొంటారు.

ఈలాగు పిల్లలతో ఆడుకొంటూ వుండగా ఒక ఆటగాడు నా దగ్గిరకు వచ్చినాడు. ఏ మూలనుంచో తెలియకుండా ముందుగా అతని రొద వినబడ్డది. నేను

ఇటూ అటూ చూశాను. పిల్ల లంతా ముసిముసి నవ్వులు మొదలుపెట్టినారు, సంతోషముతో ఒకరి నొకరు నెట్టుకోవడమువల్ల ఏదో కొత్త ఆట ఆడుతా రనుకొన్నాను.

ఇంతలో ఝుంకారము దగ్గిరికి వచ్చింది. నల్లటి రెక్కలు! సంగీతము పాడుతూ పువ్వు దగ్గరికిపోయి ముద్దు పెట్టుకొన్నాడు, చెవులో గుసగుసలాడి వచ్చేటప్పుడు చక్కలిగింత పెట్టి వస్తాడు; వెళ్ళిపోయేటప్పుడు పిల్లలంతా చేతులు చాపి 'చూచావా, చూచావా, ఇంకా కాస్త సేపు ఆడుకోవా?' అని కేక లేస్తూ వెంట పరుగెత్తినారు. అయితే అతడి పరుగు అందుకో లేక వెనుకకు తిరిగి వచ్చారు.

దీని తరువాత ఇంకొక చిత్రము జరిగింది. చక్కటి చీరె కట్టుకొని ఒక ఆమె పరుగెత్తుకొంటూ వచ్చింది. ఆమె వెంట గుంపులుగుంపులుగా ఆమెలాటి వాళ్ళు వచ్చారు. అబ్బ! వాళ్ళ చీరెలు చూసి తీరవలె! ఎన్ని రంగులు, ఎన్ని చుక్కలు! ఈ చీరెలు స్వర్గలోకములోనివి అయివుంటవి. ఎవరు నేశారో! చక్కలిగింతలు, పకపకలూ, పరుగెత్తడమూ వీళ్ళ ఆటలు అయితే. ఇన్ని రకాల చీరెలు మరెక్కడా కనబడవు.

ఇంతలోకే ఆ వన మంతా సంగీతముతో నిండిపోయింది. కోకిలలూ, చిలకలూ, సంగీతాలు పాడినవి.

అక్కడివాళ్ళు ఆడే ఆటలు చూసి సంతోషించ వలసినదే కాని చెప్పతరము కాదు. ఏమి కీర్తనలు ఏమి రాగాలు! రంగురంగుల చీరెలు కట్టుకొన్నవాళ్ళంతా ఒక నాట్య మాడినారు. ఎంత బాగున్నది నాట్యము! వాళ్ళ కాళ్ళు భూమి మీద ఆనినట్టే కనబడలేదు. గాలికి కొట్టుకొంటూ చీరెలు తమాషాగా వున్నవి.

ఇంకొక సంగతి చెప్పడము మరిచి పోయినాను. గాలి రాజు కూతుళ్ళు కూడా ఈ వనములో కనబడ్డారు. రాణీ వుయ్యాల వూపడమే గాలిరాజు కూతుళ్ళపని.

కొంతసేపటికి మేఘాలు నెమ్మదిగా వచ్చి, నన్ను కేక వేసినవి. బయలుదేరడానికి ఇష్టము లేకపోయినా విధిలేక వాటిమీద ఎక్కి ఇంటికి వచ్చినాను. కాని, మళ్ళీ అక్కడికి ఇంకోమాటు వెళ్ళుదా మని వున్నది.

*(సాహితీ ద్వైమాస పత్రిక, 1924)*